క్లుప్తంగా

రేబిస్‌పై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: రేబిస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. శనివారం జాతీయ రేబిస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెద్దనంతాపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుక్క కాటు వల్ల వచ్చే రేబిస్ నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కుక్క కరిస్తే ఆ గాయాన్ని పలుమార్లు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. వీలైనంత త్వరగా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. యాంటీ రేబిస్ టీకాను వేయించుకోవాలన్నారు. సీహెచ్‌ఓ అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్, ఇందిరా పాల్గొన్నారు.

చెట్ల సంరక్షణతోనే మానవ మనుగడ


మొక్క నాటుతున్న అధికారులు

బండిఆత్మకూరు: వృక్ష సంపద–ప్రపంచ సంపద కార్యక్రమాన్ని శనివారం బండిఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మహబూబ్‌బేగ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలు లేనిది మానవ మనుగడ లేదని, ప్రకృతి సమతుల్యతకు మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రఫీ మాట్లాడుతూ.. మొక్కలను విద్యార్థులకు దత్తతగా ఇచ్చి సంరక్షిస్తామని తెలిపారు. జిల్లా ఎన్‌జీసీ సమన్వయకర్త సి.చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్‌రెహమాన్, ఎంఈఓ యశోద, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం


రిబ్బన్ కట్ చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

పగిడ్యాల: మండల పరిధిలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి శనివారం ప్రారంభించారు. తన సొంత గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవనంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ కోటేశ్వరమ్మ, అడిషనల్ సీడీపీఓ మంగవల్లి, తహసీల్దార్ శివరాముడు, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిని సస్పెండ్ చేయాలి


ఈదమ్మను పరామర్శిస్తున్న దిలీప్‌రాజు

కొత్తపల్లి: ప్రసవ వేదనతో స్థానిక వైద్యశాలకు వెళితే సరైన సమయంలో వైద్యం అందించని వైద్య సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎస్.దిలీప్‌రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన భ్రమరాంబా చెంచుగూడెంలో బాధితురాలు ఈదమ్మను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈదమ్మ అనే గిరిజన మహిళ ఈనెల 21న స్థానిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవం కోసం వెళితే సిబ్బంది లోపలికి అనుమతించకుండా, వైద్యం చేయకపోవడం విచారకరమన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి కారుకులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడు బంగ్లా అరుణోదయ గ్రామైక్య సంఘంలో ఖాళీగా ఉన్న బుక్‌కీపర్ పోస్టు భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని వెలుగు ఏపీఎం అంబమ్మ తెలిపారు. పదో తరగతి పైబడి విద్యను అభ్యసించి 20 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి జూపాడుబంగ్లా వాసులై ఉండాలన్నారు. అలాగే అరుణోదయ గ్రామైక్య సంఘంలో సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు అక్టోబర్ 3తేదీలోగా వెలుగు కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

ఐక్యతతోనే ఏదైనా సాధించగలం

ఆత్మకూరు: సమాజంలో మార్పు కోసం యాదవులంతా ఐక్యం కావాలని అఖిల భారత యాదవ సంఘం రాయలసీమ యువజన సంఘం అధ్యక్షుడు శకునాల శివరామకృష్ణ, ఆత్మకూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మన్యం బాలస్వామియాదవ్ అన్నారు. శనివారం పట్టణంలో యాదవ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు వెంకటరమణయాదవ్, బొల్లు ప్రసాద్‌బాబు యాదవ్, కరిముల్లా యాదవ్, ఎర్రం పెద్ద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదారి పట్టించేందుకే దుష్ప్రచారం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్
- చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ చౌడేశ్వరిదేవి ఆలయంలో పూజలు


నందికొట్కూరులో చౌడేశ్వరిదేవికి పూజల అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్


పగిడ్యాల చెన్నకేశవస్వామి ఆలయంలో పూజల అనంతరం మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య

నందికొట్కూరు: సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలు ప్రశ్నించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తప్పుదారి పట్టించేందుకు తిరుమల తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని దుష్ప్రచారానికి పూనుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. శనివారం పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు చేసిన పాపాలకు భవిష్యత్తులో శిక్ష తప్పదన్నారు. లడ్డూలో కల్తీ జరిగిందని చంద్రబాబు చేసిన ఆరోపణలతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ దేవాలయాల్లోకి హిందువులే వెళ్లాలని ఎక్కడైనా రాసివుందా బాబును.. అని సూటిగా ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్ల పాటు తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ అందించిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగనన్న తిరుమలకు వెళ్లేందుకు అవసరం లేని డిక్లరేషన్ అడగడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా రాజకీయ దుర్బుద్ధితో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడ వరదల్లో సుమారు 50 నుంచి 60 మంది వరకు చనిపోతే సీఎం బాబు ఆ కుటుంబాల వైపు ఇంత వరకు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. అసత్యపు ప్రచారాలు ఇకనైనా చంద్రబాబు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మంగళి కృష్ణ, సర్పంచులు జనార్దన్‌గౌడు, వైస్ ఎంపీపీ నబీ రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, నాగభూషంరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, లోకేష్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి, నాగిరెడ్డి, రమేష్‌నాయుడు, నాగార్జునరెడ్డి, తులసిరెడ్డి, నారాయణరెడ్డి, గౌస్, కాంతారెడ్డి, రాఘవరెడ్డి, రవి, రమణ, చంద్రశేఖర్, శివ, స్వామిదాసు, జబ్బార్, మహేంద్రారెడ్డి, బాలనాయక్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్‌యాదవ్, విజయకుమార్, స్వామిరెడ్డి, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుటమి నాయకులకు సద్బుద్ధిని ప్రసాదించాలి..

మిడుతూరు: తిరుమల వివాదం సృష్టించిన కుటమి నాయకులకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ.. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి శనివారం స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల ఏడు కొండల వేంకటేశ్వర్ల స్వామి పవిత్రతకు భంగం కలిగించడమే కాకుండా హిందువుల మనోభావాలను దెబ్బతీయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామనాగేశ్వరరెడ్డి, ఓబులేసు, రామానాయుడు, రామ్మోహన్, రాములు రెడ్డి, వెంకటరమణ, జనార్దన్, గణపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీస్తే ఖబడ్దార్..

పగిడ్యాల: కలియుగ దైవమైన తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్టకు భంగం కలిగించి, భక్తుల మనోభావాలతో ఆడుకోవాలని చూస్తే ఖబడ్దార్ అంటూ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ధ్వజమెత్తారు. చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరారు శనివారం స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉండే హిందువులు వెంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూను ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంకటేశ్వరస్వామి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిసిన కల్తీ నెయ్యిని వినియోగిస్తున్నారని నిసిగ్గుగా మాట్లాడారన్నారు. ఆయన హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఎంపీటీసీ మిద్దె స్వాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపు గోవిందరెడ్డి, భాస్కరరెడ్డి, బొబ్బిటి బాబురెడ్డి, నారమ్మగారి గోవిందరెడ్డి, ఇబ్రహీం, రవి, సుధాకర్, నీలకంఠరెడ్డి, మద్దిలేటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే నీచ రాజకీయాలు

పాములపాడు: రాష్ట్రంలో కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నందునే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని జిల్లా నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు దేవాలయాన్ని శుభ్రంగా కడిగి, టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ ముర్తుజావలి, మాజీ సర్పంచు బాలునాయక్, సొసైటీ మాజీ చైర్మన్లు గడ్డర్‌కృష్ణారెడ్డి, చౌడయ్య, నాయకులు సంజీరెడ్డి, మహానందిరెడ్డి, శివలింగం, హుసేన్, అంబయ్య, శ్రీనివాసులు గౌడు, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఇప్పుడే గుర్తు వచ్చాయా..

మహానంది: తిరుమల వేంటేశ్వరస్వామి దర్శనార్థం నిత్యం లక్షలాది మంది భక్తులు వెళ్తుంటే గుర్తుకు రాని నిబంధనలు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెళ్తుంటే గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందని జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు కూటమి నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ మహానందిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. వివాదాస్పద అంశాలపై పెట్టిన దృష్టి అభివృద్ధిపై పెట్టాలని హితవుపలికారు. సర్పంచ్ సుదర్శనం, ఉప సర్పంచ్ కొమ్మా ప్రతాపరెడ్డి, జయసింహారెడ్డి పాల్గొన్నారు.

- **ఆత్మకూరురూరల్:** పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు చేశారు. నాయకులు కరివేన సురేష్, నల్లకాల్వ ఎల్లయ్య, వెంకటస్వామి గౌడ్, కౌన్సిలర్ విజయ్, రవినాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- **వెలుగోడు:** పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని చంద్రబాబు... ప్రజల దృష్టిని మళ్లించేందుకు తిరుమల లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ప్రజల మనోభావాలతో చెలగాటమాడడం తగదన్నారు. సర్పంచ్ వేల్పుల జయపాల్, దేశం తిరుపం రెడ్డి, బల్లాని వెంకట సత్యనారాయణ, ఇలియాస్‌ఖాన్, గోవిందు, రమణ, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, ఎంపీటీసీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- **బండిఆత్మకూరు:** వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జనార్ధనస్వామి ఆలయంలో పూజలు చేశారు. మాజీ ఎంపీపీ దేసు వెంకట రామిరెడ్డి, నాయకులు చిన్న సుబ్బారెడ్డి, దూదేకుల జమాల్‌బాషా, వైస్ ఎంపీపీ రాగాల రమణ, ఎంపీటీసీ పుల్లయ్య, మధు, నాగేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బండిఆత్మకూరులో..


మిడుతూరు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పాములపాడులో చౌడేశ్వరీదేవి ఆలయంలో టెంకాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆత్మకూరు: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వెలుగోడులో..

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

మహానంది: మహానంది దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి జరగనున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పలుకుతూ ఆలయ అధికారులు, వేద పండితులు శనివారం ఆహ్వాన పత్రికలు అందించారు. నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో పాటు దాతలు అవ్వారు గౌరీనాథ్, కూరగాయల మార్కెట్ ప్రసాద్ తదితరులకు ఆహ్వాన పత్రికలు అందించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ మధు, వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, తదితరులు ఉన్నారు.



ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు ఆహ్వానం


మాజీ ఎంపీ పోచాకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఏఈఓ

పక్కా గృహాలు పూర్తి చేయకుంటే రద్దు

ఆత్మకూరు: వచ్చే ఏడాది మార్చి నాటికి పక్కా గృహాలు పూర్తి చేసుకోకపోతే వాటిని రద్దు చేస్తామని నంద్యాల కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో శనివారం మన ఇల్లు–మనగౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణంలో అత్యంత విశాలమైన లేఅవుట్ ఉందని, ఒకే చోట 1,208 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. అయితే 131 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారని, మిగిలిన వారు వచ్చే మార్చి నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే బిల్లులు నిలిపేస్తామని తెలిపారు. రహదారులు, సీసీ రోడ్లు, వీధి లైట్లు లేవని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షల బిల్లును వెంటనే మంజూరు చేస్తామన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

కార్యక్రమంలో ప్రత్యేకాధికారి తులసీరెడ్డి, తహసీల్దార్ రత్నరాధిక, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ డీఈ హరిగోపాల్, వెంకటేశ్వర్లు, డీఈఈ రఘువర్మ, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్, సీఐ ఓబులేష్, ఎస్‌ఐ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అంశంపై అవగాహన ఉండాలి

పాములపాడు: విద్యార్థులు ప్రతి అంశంపై సమగ్రంగా సమాచారాన్ని తెలుసుకోవాలని హెచ్‌ఎం గోపాల్ అన్నారు. శనివారం స్థానిక ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర 2047లో భాగంగా విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలో ప్రథమ విజేతగా వస్మిత ఏపీ మోడల్‌స్కూలు, ద్వితీయ విజేత మహాలక్ష్మి జెడ్పీహెచ్‌ఎస్ పాములపాడు, తృతీయ విజేత నిఖిల జెడ్పీహెచ్‌ఎస్ మిట్టకందాల, డిబెట్ పోటీల్లో ప్రథమ విజేత ప్రభాస్ ఏపీ మోడల్ స్కూలు, ద్వితీయ విజేత కేర్తురా జెడ్పీహెచ్‌ఎస్ వానాల, తృతీయ విజేత లక్ష్మి,జెడ్పీహెచ్‌ఎస్ పాములపాడు నిలిచారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం కీర్తన జెడ్పీహెచ్‌ఎస్ వానాల, ద్వితీయ స్థానం భాగ్యమ్మ జెడ్పీహెచ్‌ఎస్ మిట్టకందాల, తృతీయ స్థానం వసంతకుమార్ జెడ్పీహెచ్‌ఎస్ పాములపాడు విద్యార్థులు కై వసం చేసుకున్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బయ్య, రవి, శ్రీనివాసులు, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో శనివారం వేకువజామున చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగుడు హుండీలోని సుమారు రూ.25 వేలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. చోరీ జరిగిన తీరును సీసీ కెమెరాల్లో పరిశీలించామని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి చేయాలి

జూపాడుబంగ్లా: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రత్యేకాధికారి రాజు, ఎంపీపీ సువర్ణమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్ సూచించారు. మండలకేంద్రంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మొట్టి బాలయ్య, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ

మిడుతూరు: మండలపరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన కురువ వెంకటరాముడు తల్లి సరోజనమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే చౌట్కూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిజ్జుల గోపాల్ రెడ్డి సోదరుడు జయరామి రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. డాక్టర్ దారా సుధీర్ వారి గృహానికి చేరుకొని కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట తిమ్మాపురం సర్పంచ్ నాగస్వామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణా రెడ్డి, సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి తదితరులు ఉన్నారు.


చౌట్కూరులో జయరామిరెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ దారా సుధీర్

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

నందికొట్కూరు: పట్టణంలోని జైకిసాన్ పార్కులో శనివారం చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు మాండ్ర శివానందరెడ్డి వర్గీయులు, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సమావేశంలో 30 అంశాలను ప్రవేశ పెట్టగా 12 అంశాలకు ఆమోదం తెలపాలని మాండ్ర వర్గీయులు, లేదు అన్నింటికీ ప్రాధాన్యత ఇవ్వాలని బైరెడ్డి వర్గీయులు వాదులాడుకున్నారు. అలాగే నూతన మున్సిపల్ కార్యాలయం పట్టణ శివారులో కాకుండా, పట్టణంలోని మున్సిపల్ స్థలలోనే నిర్మించారని మాండ్ర వర్గీయులు, లేదు ఇప్పటికే నిర్మాణాలు కొనసాగుతున్నందున ఆర్థిక నష్టం వాటిల్లుతుందని బైరెడ్డి వర్గీయులు వాదించారు. అదేవిధంగా స్పెషల్ గ్రాంట్ నిధులు ఇతర పనులకు వినియోగించడంపై 2వ వార్డు కౌన్సిలర్ నిలదీశారు. ఇరువర్గాల మధ్య వాదనలు తీవ్ర స్థాయికి చేరుకోగా.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. ఇదిలా ఉండగా పట్టణాభివృద్ధిపై చర్చించడం వదిలేసి వ్యక్తిగత దూషణలకు కౌన్సిలర్లు దిగడంపై పట్టణ ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బేబి, సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ రబ్బానీ, టీపీఓ బాలమద్దయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

పాములపాడు: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని నియోజకవర్గం ప్రత్యేకాధికారిణి రత్నరూత్ అన్నారు. శనివారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి బిల్లుల చెల్లింపులు వెంటనే జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, ఎంపీడీఓ గోపీకృష్ణ, ఈఓపీఆర్డీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


చెలిమిల్లలో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి రత్నరూత్

2025 మార్చిలోగా ఇళ్లు నిర్మించుకోండి

జూపాడుబంగ్లా /కొత్తపల్లి: జగనన్నకాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు 2025 మార్చిలోగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని జూపాడుబంగ్లా మండల ప్రత్యేకాధికారి రాజు, మండల హౌసింగ్ ఇన్‌చార్జి జ్యోతి, కొత్తపల్లి ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. శనివారం జూపాడుబంగ్లా జగనన్నకాలనీలో సర్పంచ్ మొట్టబాలయ్య అధ్యక్షతన, కొత్తపల్లిలో హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ పాండునాయక్ ఆధ్వర్యంలో మనఇళ్లు–మనగౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా ఎంపీపీ సువర్ణమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీటీసీ వెంకటమ్మ, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

నందికొట్కూరు: భరతమాత ముద్దు బిడ్డ భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో పీఎస్‌ఎఫ్ నాయకులు ఆరిఫ్, జావేద్, అరవింద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, సీపీఐ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 117వ జయంతిని నిర్వహించారు. అనంతరం గురుకుల పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే భాస్కరాపురంలో యువత భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు.. కార్యక్రమంలో చెంచుసంఘం నాయకుడు పుల్లన్న, ఏఐవైఎఫ్ నాయకులు రమేష్, రవికుమార్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.


జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్, రమేష్

సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ చైర్మన్ మారూఫ్ ఆసియా
- కౌన్సిల్ సమావేశంలో రెండు అంశాలకు తీర్మానం

ఆత్మకూరు: పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆత్మకూరు పురపాలక సంఘం చైర్మన్ డాక్టర మారూఫ్ ఆసియా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రోఫ్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మూడు అంశాలపై అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ల ముందు ప్రవేశపెట్టిన అజెండాలో రెండు అంశాలను కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపట్టే విధంగా ముందుకెళ్తామన్నారు. డ్రైయినేజీ కాలువలు, అంతర్గత సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, విద్యుత్ స్తంభాలు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, మేనేజర్ ఆర్‌ఐ నాగబ్రహ్మం, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్, వార్డు కౌన్సిలర్లు సుగుణమ్మ, పాణ్యంపార్వతి, లక్ష్మమ్మ, ఖైరున్‌బి, గస్, లాజం యూనిస్, విజయ్, రంగస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మారూఫ్ ఆసియా

పంట మోతాదుకు మించి యూరియా వాడొద్దు

వెలుగోడు: రైతులు వరి పంటకు యూరియాను మోతాదుకు మించి వాడితే చీడ పీడలు అధికంగా వస్తాయని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. శనివారం వెలుగోడు రైతు సేవా కేంద్రంలో యూరియా స్టాక్ పరిశీలించారు. గుంతకందాల, అబ్దుల్లాపురంలో నత్రజని శాతం తక్కువగా ఉన్నందున యూరియా మోతాదు ఎక్కువగా వాడాలన్నారు. మండలంలో వరి ఎక్కువగా సాగు చేస్తారు కాబట్టి యూరియా నాలుగుసార్లు వాడాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఐషర్ వాహనం ఢీకొన్న ఘటనలో రాజగోపాల్(38) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి కాలినడకన ఇంటికి వెళ్తుండగా ఐషర్ వాహనం డ్రైవర్ రివర్స్ తీసుకునే క్రమంలో ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన రాజగోపాల్‌ను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుడు చంద్రహాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గనమల సుబ్బరావు తెలిపారు.

పంట నమోదు చేయించుకోండి

మహానంది: ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీ నమోదు సోమవారం లోపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ టెక్నికల్ ఆఫీసర్ ఆయుబ్ బాషా తెలిపారు. ఏఓ నాగేశ్వర రెడ్డితో కలిసి మసీదుపురంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.